క్లుప్తంగా

ధ్వజస్తంభ ప్రతిష్టలో పాల్గొన్న కృష్ణచైతన్య



పూజా కార్యక్రమంలో పాల్గొన్న కృష్ణచైతన్య

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలోని పురాతన దేవాలయం కమలేశ్వరస్వామి దేవస్థాన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమంలో గురువారం రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కృష్ణచైతన్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. దేవస్థాన కమిటీ సభ్యులు కృష్ణచైతన్యను దుశ్శాలువాతో సత్కరించి, తీర్థప్రసాదాలు అందజేశారు.

నేడు ద్రోణాదులలో ఆమంచి పర్యటన

మార్టూరు: పర్చూరులో నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆమంచి కృష్ణమోహన్ నేడు మండలంలోని ద్రోణాదుల గ్రామంలో పర్యటించనున్నట్లు పర్చూరు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఇతర ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని ప్రకటనలో కోరారు.

పాఠశాలకు మైక్‌సెట్ వితరణ



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మేదరమెట్ల: మండల కేంద్రమైన కొరిశపాడు జగ్జీవన్‌నగర్‌లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు డాక్టర్ దండు జయప్రకాష్‌నారాయణ రెడ్డి రూ.13 వేల విలువగల సౌండ్‌బాక్స్‌ను గురువారం పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయకుమార్, విద్యాకమిటీ చైర్మన్ ఆర్.అనూష, తేళ్ల శ్రీనివాసరావు, అంజయ్య, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హైవేపై బొలేరో బోల్తా

మార్టూరు: టైరు పగిలి జాతీయ రహదారిపై అడ్డంగా బొలేరో వాహనం బోల్తా పడిన ఘటన మార్టూరులో గురువారం సాయంత్రం జరిగింది. అందిన వివరాల మేరకు.. తెనాలికి చెందిన షేక్ బాషా ఒంగోలు నుంచి తెనాలికి టాటా బొలేరో వాహనంతో వెళ్తున్నాడు. స్థానిక పెట్రోలు బంకు ఎదురు ఫ్లైఓవర్‌పై వాహనం టైరు పగిలి అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొని రహదారిపై అడ్డంగా పడింది. బాషాకు ఎటువంటి గాయాలు కాకపోవటంతో స్థానికులు అతని వాహనం నుంచి వెలుపలికి రప్పించారు. హైవే సిబ్బంది రహదారికి అడ్డుగా ఉన్న వాహనాన్ని పక్కకు తరలించి రాకపోకలు పునరుద్ధరించారు.

మధ్యాహ్న భోజనంలో మెనూ తప్పనిసరి



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో విజయలక్ష్మి

చినగంజాం: మధ్యాహ్న భోజనం పంపిణీలో నాణ్యతకు, పౌష్టికాహార పంపిణీకి ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో డీ విజయలక్ష్మి సూచించారు. గురువారం ఆమె మండలంలోని కొత్తగొల్లపాలెం ఎంపీపీ పాఠశాల, పెదగంజాం 2 సచివాలయం, రాజుబంగారుపాలెం వైసీ ప్రాథమిక పాఠశాలను సందర్శించి, పాత గొల్లపాలెంలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి తిరునాళ్లకు సిద్ధం



కొత్తపాలెంలోని బాలకోటేశ్వరస్వామి దేవస్థానం



సోపిరాలలోని రామకోటేశ్వర దేవస్థానం

● పోటాపోటీగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు

చినగంజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని అత్యంత వైభవంగా నిర్వహించుకునేందుకు మండలంలోని రెండు శైవ క్షేత్రాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఏడాది మాఘ కృష్ణ చతుర్దశి నాడు వచ్చే మహాశివరాత్రి పండుగను హిందువులందరూ ఘనంగా జరుపుకుంటారు. సంక్రాంతి అతి పెద్ద పండుగగా జరుపుకునే ఆనవాయితీ కాగా చినగంజాం మండలంలో శివరాత్రి అతిపెద్ద పండుగగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తారు. మండలంలోని కొత్తపాలెం పంచాయతీలోని బాలకోటేశ్వర స్వామి ఆలయం, చినగంజాం పంచాయతీలోని సోపిరాల గ్రామంలో రామకోటేశ్వస్వామి ఆలయంలో ప్రతి ఏడాది శివరాత్రి తిరునాళ్లను ఘనంగా నిర్వహిస్తారు. రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందిన గుంటూరు జిల్లా



రామకోటేశ్వరస్వామి మూలవిరాట్

కోటప్పకొండ తరువాత జిల్లాలోని చినగంజాం మండలంలో శివరాత్రి తిరునాళ్ల అంతటి ప్రసిద్ధి పొందింది. శైవక్షేత్రాల్లో శ్రీశైలం, మహానంది, కోటప్పకొండ, అమరావతి మొదలగు పుణ్యక్షేత్రాలతో పాటు చిన్న కోటప్పకొండగా పిలువబడే మహిమ గల దేవాలయం బాలకోటేశ్వరస్వామి దేవాలయం చినగంజాం మండలంలోనిదే. కొత్తపాలెం పంచాయతీలో 101 శివలింగాలతో బాలకోటేశ్వర స్వామి దేవస్థానం ఉండగా, దేవాలయానికి 400 ఏళ్ల చరిత్ర కలిగి ఉంది. జిల్లాలో శివరాత్రి పండుగను ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ప్రాంతాల్లో చినగంజానికి ప్రత్యేక స్థానం ఉంది. శనివారం మహాశివరాత్రి పండుగను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రెండు దేవాలయాల ఉత్సవ కమిటీలు భారీ ఏర్పాట్లు చేశాయి. శివరాత్రికి సుమారు కోటి రూపాయిలుపైగా వెచ్చించి నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. కొత్తపాలెం పంచాయతీలోని బాలకోటేశ్వర స్వామి ఆలయానికి పూర్వ చరిత్ర ఉంది. దేవాలయంలోని బాలకోటేశ్వరుడు స్వయంభు లింగం కాగా భక్తులు కోర్కెలను తీర్చే స్వామిగా ఆయనకు ప్రజలలో ప్రగాఢ విశ్వాసం ఉంది.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారం



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

యద్దనపూడి: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయం కోసం వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం ప్రచారం నిర్వహించారు. వారి ఆధ్వర్యంలో తూర్పు రాయల సీమ ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి ఎన్నికల ప్రచారానికి సంబంధించిన కరపత్రాలను గ్రామంలోని వివిధ ఉద్యోగుల కార్యాలయాలు, సచివాలయాల సిబ్బంది, పోలీస్ స్టేషన్ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయ సిబ్బందికి , మండల కార్యాలయ సిబ్బందికి, జూనియర్ కాలేజీ సిబ్బందికి, ఎంపీడీవో, వెలుగు కార్యాలయ సిబ్బందికి, పట్టభద్రులకు పంపిణీ చేశారు. తమ అమూల్యమైన ఓటు హక్కును మొదటి ప్రాధాన్యత-1 నంబర్‌పై ఓటు వేసి పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో యద్దనపూడి నాయకులు రావూరి వేణుబాబు, ముప్పల రాంబాబుమాజీ ఎంపీపీ, జెడ్పీటీసీ సీహెచ్ లక్ష్మీనారాయణమ్మ, గ్రామ సర్పంచ్ వలేరు రేణుక బాలకోటేశ్వరరావు, మాజీ మండల కన్వీనర్ దూళిపాళ్ల వేణు, నాయకులు మారెళ్ల శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరి మహోత్సవాలు



పూజలు చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల: దేవాంగపురిలో 24 సేనాధిపతుల ఆధ్వర్యంలో చౌడేశ్వరి అమ్మవారి జ్యోతిర్మ మహోత్సవాలు బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. కార్యమానికి చీరాల నియోజవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొని అమ్మవారి ప్రత్యేక పూజలు చేశారు. చీరాల, ప్రసాద్‌నగరంలో విఘ్నేశ్వర స్వామి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి కరణం వెంకటేష్ హాజరైన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చుండూరి వాసు, కామక్షి కేర్ హాస్పిటల్ ఎండీ తాడివలస దేవరాజు, వడ్లమూడి శ్రీనివాసారావు, ఆకురాతి ప్రసాద్, మద్దిసాని శ్రీనివాసరావు, వడ్లమూడి గోపీ, సుబ్రహ్మణ్యం, పాకల శ్రీను, అర్చక స్వామి గాప్రసాద్, బుర్ల మురళీకృష్ణ, వాక కృష్ణరెడ్డి, కోడూరిప్రసాద్ రెడ్డి, బత్తుల అనిల్, కంప అరుణ్ పాల్గొన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



ప్రభుత్వ భవనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో



తిమ్మనపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీవో

జె.పంగులూరు: వలంటీర్ల పనితీరు బాగాలేదని, పనితీరు మెరుగుపరుచుకొని, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎప్పటికప్పుడు సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీడీవో వీ రమణమూర్తి కోరారు. పంగులూరు మండలంలోని కోటపాడు గ్రామంలో గురువారం నిర్వహించిన విస్తృత తనిఖీలో భాగంగా వలంటీర్ల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేసి పలు రికార్డులను, సిబ్బంది హాజరు పరిశీలించారు. గ్రామంలోని ఆడిటోరియంలో ఆరోగ్య సిబ్బంది నిర్వహిస్తున్న మందులు పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

మేదరమెట్ల: సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఎంపీడీవో సురేష్‌బాబు అన్నారు. కొరిశపాడు మండలంలోని తిమ్మనపాలెం సచివాలయాన్ని గురువారం ఆయన పరిశీలించారు. సచివాలయంలో జరుగుతున్న పనులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు అలాగే రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య విషయాలు ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు.

నిర్మాణ పనుల్లో ఆలస్యం తగదు



నిర్మాణాలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్ రామారావు

కారంచేడు: ప్రభుత్వ భవన నిర్మాణ పనుల్లో అలసత్వం వహించకూడదని, వేగవంతంగా పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి కేవీ రామారావు అన్నారు. గురువారం ఆయన మండలంలోని తిమిడెదపాడు, పోతినవారిపాలె, దగ్గుబాడు గ్రామాల్లోని భవన నిర్మాణాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గ్రామాల్లో సచివాయ, ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్‌ల భవన నిర్మాణాలు ఏఏ దశల్లో ఉన్నాయో ఆయన ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన డిజిటల్ లావాదేవీలు



మాట్లాడుతున్న డీజీఎం ప్రకాష్

చీరాల టౌన్: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సూచనలతో ఖాతాదారులకు మెరుగైన డిజిటల్ లావాదేవీలు జరుపుకొనేలా చర్యలు చేపడుతున్నామని పీడీసీసీ బ్యాంక్ రీజనల్ కార్యాలయ డీజీఎం వై ప్రకాష్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని తోటవారిపాలెం చంద్రమౌళీనగర్‌లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఖాతాదారులు డిజిటల్ లావాదేవీల విషయంలోను తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పీడీసీసీ బ్యాంక్ మేనేజర్ వాసుదేవ్‌సింగ్ మాట్లాడుతూ మన బ్యాంక్ నందు చేసే డిపాజిట్లపై మరే ఇతర బ్యాంకులు ఇవ్వనంతగా అధిక వడ్డీలు అందిస్తున్నాయని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రీజినల్ ఆఫీస్ ఛీఫ్ మేనేజర్ ఎం విశ్వేశ్వరరావు మాట్లాడుతు ఎస్‌హెచ్‌జీ గ్రూపులు, ఏటీఎం లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవం

చీరాల అర్బన్: పట్టణంలోని పేరాలలో వేంచేసియున్న భద్రావతి సమేత భావనాఋషి దేవస్థాన ప్రాంగణంలోని అభయాంజనేయస్వామి వారి 19వ విగ్రహ ప్రతిష్ట వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన ప్రధాన కార్యదర్శి జీవీ సుబ్బారావు గురువారం తెలిపారు. ఉదయం 8గంటలకు స్వామివారికి పాలాభిషేకం, ఆకుపూజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం పూజా కార్యక్రమాల అనంతరం భజన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, కార్యక్రమాల్లో భక్తులందరూ విరివిగా పాల్గొనాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి అవసరం

బల్లికురవ: బడిఈడు కలిగిన బాలబాలికలందరిని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని తహసీల్దార్ పీ.సీతారత్నం కోరారు. గురువారం వల్లాపల్లి గ్రామంలోని సీఏయూపీ ఎయిడెట్ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. తనిఖీలో పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి పోస్టులు భర్తీ చేయనందున ఒక్కడినే ఏడు తరగతులు బోధించాల్సి వస్తుందన్నారు. డిప్యూటేషన్ పైనైనా ఇరువురు ఉపాధ్యాయులను కేటాయించాలని తహసీల్దార్‌కు విన్నవించారు. సచివాలయ, ఆర్‌బీకె, వైఎస్సార్ హెల్త్ క్లీనిక్ అసంపూర్తి భవనాలు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కోరారు. అంతకు



అసంపూర్తి భవనాలను పరిశీలిస్తున్న తహసీల్దార్

ముందు గ్రామంలోని సర్వే నంబర్ 312లో చింత తోపులో చెత్త నుంచి సంపద కేంద్ర నిర్మాణానికి స్థలాన్ని తహసీల్దార్ పరిశీలించారు. పరిశీలనలో సెక్రటరీ పీఏఆర్ ఖాన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సుస్థిర పద్ధతులతో దిగుబడులు

యద్దనపూడి: సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించటం ద్వారా పొగాకులో అధిక దిగుబడులు సాధించవచ్చని జీపీఐ కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిండెంట్ డి. జితేంద్ర అన్నారు. గురువారం మండలంలోని అనంతవరం గ్రామంలో జీపీఐ కంపెనీ, యూనివర్సల్ లీఫ్ టూబాకో ఆధ్వర్యంలో పొగాకు పండించే రైతులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జితేంద్ర మాట్లాడుతూ ఈ ఏడాది అడుగు ఆకు నుంచి పై ఆకు వరకు మెత్తం పొగాకు ఉత్పత్తులను మెత్తం జీపీఐ కంపెనీ వారే కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంపెనీ జనరల్ మేనేజర్ ప్రభాకర్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వై. పాటిల్ రైతులు పాల్గొన్నారు.

భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటరెడ్డి

మార్టూరు: రైతులకు సంబంధించిన భూ హక్కు పత్రాలను అధికారులు సత్వరం పంపిణీ చేయాలని తహసీల్దార్ వెంకటరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల కేంద్రం మార్టూరులో నిర్వహించిన భూముల సర్వేలో 1567 మంది రైతులకు భూ హక్కు పత్రాలు పంపిణీ చేయాల్సి ఉండగా 555 మందికే పంపిణీ చేశారని మిగిలిన 1012 మంది రైతులకు త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నితిన్, పంచాయతీ కార్యదర్శులు, వలంటీర్‌లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

రెండు పూరి గుడిసెలు దగ్ధం

పర్చూరు: మండలంలోని ఇనగల్లులో గురువారం రెండు పూరి గడిసెలు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తుల వివరాల మేరకు.. విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో గ్రామానికి చెందిన భూపతి జయమ్మ, గనికపూడి రత్నకుమారిలకు చెందిన రెండు పూరిళ్ల సామాన్లతో సహా పూర్తిగా దగ్ధమయ్యాయి. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం వాటిల్లలేదు. చిలకలూరిపేటకు చెందిన అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో జయమ్మకు చెందిన ఇంటి సామాన్లు పూర్తిగా కాలి బూడిదవ్వగా, రత్నకుమారికి చెందిన ఇంట్లో ఇంటి సామాన్లతో పాటు ఇంట్లో ఉన్న రెండు సవర్ల బంగారు ఆభరణాలు, రూ.70 వేల నగదు పూర్తిగా



అగ్నికి ఆహుతవుతున్న పూరి గుడిసెలు

కాలిపోయాయి. బాధితుల ఫిర్యాదుతో వీఆర్‌ఓ బుల్లెయ్య, తహసీల్దారు నెహ్రూబాబులు ఘటన స్థలాన్ని సందర్శించి బాధితులకు తక్షణ సాయంగా నిత్యావసరాలు అందించారు.

పోలీస్‌స్టేషన్ ముందు బాధితుల పడిగాపులు



పోలీస్ స్టేషన్ ఎదుట పడిగాపులు కాస్తున్న బాధితులు

మార్టూరు: కన్నకొడుకు బారి నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కన్నతల్లి పోలీస్ స్టేషన్ ముందు పడిగాపులు కాయడం చర్చనీయాంశంగా మారింది. ఫిబ్రవరి 4వ తేదీన మండలంలోని ద్రోణాదుల గ్రామంలో వృద్ధురాలైన నూతక్కి జయమ్మను ఆమె కుమార్తెను కుమారుడు వీరనారాయణ అతని భార్య పావని దాడి చేసి గాయపరచిన సంగతి తెలిసిందే. 11 రోజుల చికిత్స అనంతరం గుంటూరు ప్రభుత్వాసుపత్రి నుంచి బుధవారం సాయంత్రం అంబులెన్స్‌లో నేరుగా మార్టూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన జయమ్మ ద్రోణాదుల్లోని తన నివాసంలోకి వెళ్లటానికి తన కుమారుడు, కోడలు నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని ఎస్సై కమలాకర్‌ను కోరింది. బుధవారం రాత్రి 10 గంటలు ప్రాంతంలో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన బాపట్ల డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ ఫిరోజ్‌లకు విన్నవించుకుంది. రక్షణ కల్పించాలని ఎస్సైను డీఎస్పీ ఆదేశించారు. ఈక్రమంలో గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అంబులెన్స్‌లో పోలీసు స్టేషన్‌కు వచ్చిన జయమ్మ తన నలుగురు కుమార్తెలతో రాత్రి 9 గంటల వరకు వేచి ఉండటం గమనార్హం. ఏఎస్సై మహబూబ్ బాషా మాట్లాడుతూ జయమ్మ కుమారుడు వీరనారాయణ కోసం కబురు చేశామని ఇంత వరకు స్టేషన్‌కు రాలేదని చెప్పటం గమనార్హం. ఐదుగురు మహిళలు, బహిర్భూమికి సైతం వెళ్లలేని పేషంట్ అయిన తమ తల్లితో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేచి చూసినా తమ పట్ల పోలీసులు స్పందన నామమాత్రం కూడా లేకపోవటం పట్ల బాధితులు, స్థానికులు పోలీసుల తీరును ప్రశ్నిస్తున్నారు.

బాలకోటేశ్వరస్వామి ఆలయానికి చేరిన ప్రభ

చినగంజాం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని కొత్తపాలెం బాలకోటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోకి తొలిగా కోకి వంశస్తుల నారాయణ ప్రభ గురువారం వచ్చి చేరింది. కొన్ని దశాబ్దాలుగా ఆనవాయితీగా శివరాత్రి పండుగకు ఒక రోజు ముందుగా కోకి వారి నారాయణ ప్రభ ఆల



ఊరేగింపుగా తీసుకువస్తున్న నారాయణ ప్రభ

యానికి వస్తుంది. ఈ నేపథ్యంలో మున్నం వారిపాలెంలోని వంశస్థులు ప్రభను ఏర్పాటు చేసి దానిని రంగురంగుల అలంకరణలతో విద్యుద్దీప కాంతులతో ప్రభను అలంకరించి ఊరేగింపుగా తీసుకువచ్చారు. ప్రభను మేళతాళాలతో, బాణ సంచాతో గురువారం రాత్రి బాగా పొద్దుపోయేంతవరకు మున్నం వారిపాలెం, కొత్తపాలెం, చినగంజాం, మూలగాని వారిపాలెం గ్రామాల గుండా ఆలయ ప్రాంగణానికి చేర్చారు.

22న పర్చూరు మండల సమావేశం

పర్చూరు: ఈ నెల 22వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మండల పరిషత్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లక్ష్మీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మేకా ఆనందకుమారి అధ్యక్షతన జగబోయే సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

50 మందికి నిత్యావసరాలు పంపిణీ

చినగంజాం: మండలంలోని 50 నిరుపేద కుటుంబాలకు ఒంగోలు వింగ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ నిత్యావసర సరుకులు గురువారం అందజేశారు. మండలంలోని చినగంజాం మహాలక్ష్మి కాలనీ, కడవకుదురు, మున్నం వారిపాలెం, కొత్తపాలెం, సోపిరాలలో ఉన్న దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు వీటిని అందజేశారు. సేవా సంస్థ ప్రెసిడెంట్ చింతపల్లి రామకృష్ణ, లక్ష్మి, కోశాధికారి ఉదయ జానకి లక్ష్మి, కళ్యాణ్‌కుమార్ పాల్గొన్నారు.



నిత్యావసరాలు అందిస్తున్న సంస్థ ప్రతినిధులు